హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలీసు శాఖకు వెన్నుదన్నుగా నిలుస్తూ పోలీస్ శాఖ నిర్వహించే ప్రతి పనిలోనూ వారికి సహకరిస్తూ ఉత్తమమైన సేవలందించే విభాగంగా హోంగార్డు వ్యవస్థ రూపుదిద్దుకుందని ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు మైదానంలో హోంగార్డు 63వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హోంగార్డులు ముఖ్య, విశిష్ట అతిథులకు గౌరవ వందనాన్ని సమర్పించారు. ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి (అసిస్టెంట్ ఎస్‌పి సుస్మిత), అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి మునిరాజా, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్‌లు ఈ గౌరవ వందనాన్ని స్వీకరించారు.

జెడ్‌పి రూటే.. సెపరేటు..!

- పాలన ముగిసే ముందు ఇష్టానుసారం నిర్ణయాలు
- జాతీయ నేతల విగ్రహాలు మూసివేస్తూ షాపుల నిర్మాణం
- బినామీలకు కట్టబెడుతూ ప్రధాన గేటు పక్కన 3 షాపుల నిర్మాణమని ఆరోపణలు
- వ్యాపారం ముసుగులో వందల ఏళ్ల చెట్లు సైతం నరికివేత
- సెక్షన్ ఆధునికీకరణ నిధుల ఖర్చుపై ఇప్పటికీ లెక్కలు కరువు
- ఉద్యోగ సంఘ భవనం కమర్షియల్‌కు ఇచ్చి అభాసుపాలు
- జిల్లా పరిషత్‌లో అవకతవకలపై ఇటీవల డీసెంట్ నోట్ ఇచ్చిన సభ్యులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ పాలకుల పదవీకాలం దగ్గరపడటంతో హడావుడిగా ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారం పేరుతో వందల ఏళ్లనాటి చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేసిన పాలకులు ఇప్పుడు మరో విధ్వంసానికి పూనుకున్న పరిస్థితి కన్పిస్తోంది. ఏలూరు ప్రధాన రహదారిపై వెళ్లేవారికి కన్పించేలా ఏర్పాటు చేసిన జాతీయ నాయకుల విగ్రహాలను కన్పించకుండా వాణిజ్య దుకాణాలు నిర్మించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిషత్ పాలకులకు 2026 సెప్టెంబర్‌తో పదవీకాలం ముగియనుంది. సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సైతం సన్నాహాలు చేస్తోంది. దీంతో ప్రస్తుత పాలకులు దిగిపోయే ముందు.. దండుకుందాం అనే రీతిలో వ్యవహారాలు సాగిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 40 లక్షల జనాభాకు జవాబుదారీతనంగా ఉండాల్సిన జిల్లా పరిషత్ అందుకు విరుద్ధంగా ముందుకు సాగుతోంది. జిల్లా పరిషత్ ప్రధాన గేటుకు పక్కగా మహాత్మాగాంధీ, అంబేద్కర్, జ్యోతిరావుపూలే, బాబు జగ్జీవన్‌రావు, మదర్ థెరిస్సా వంటి నేతల విగ్రహాలు ఉన్నాయి. ఏలూరు మీదుగా విజయవాడ వెళ్లే వారందరికీ ఈ విగ్రహాలు కన్పిస్తాయి. ఇవి జిల్లా పరిషత్ హుందాతనాన్ని ఎంతగానో ఇనుమడింపచేస్తున్నాయి. జాతీయ నాయకుల విగ్రహాలు ఇక నుంచి జనాలకు కన్పించకుండా చేసే ప్రక్రియకు పాలకులు, అధికారులు పూనుకున్నారు. ప్రధాన గేటు పక్కగా జాతీయ నాయకుల విగ్రహాలను మూసివేసేలా వాణిజ్య దుకాణాల నిర్మాణం చేపట్టారు. ఇరువైపులా మూడు షాపుల నిర్మాణానికి అనుమతులు పొందినట్లు తెలుస్తోంది. పనులు సైతం ప్రారంభించేశారు. కొంతమంది బినామీల పేరున ఈ షాపులకు అనుమతులిచ్చి నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ షాపుల నిర్మాణం కోసం కొన్ని నెలల క్రితమే వందల్ల ఏళ్ల వయసున్న చెట్లను సైతం నరికేశారు. ఇప్పటికే జిల్లా పరిషత్ ఆవరణలో దాదాపు తొమ్మిది వరకూ వ్యాపార దుకాణాలను నిర్మించారు. ఆ దుకాణాల నుంచి అద్దెలు సకాలంలో వసూలు చేస్తున్నారో, లేదో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఇప్పుడు కొత్తగా దుకాణాల నిర్మాణం సైతం రాజకీయ నాయకుల స్వలాభంతో జరుగుతుందనే చర్చ సర్వత్రా సాగుతోంది.

సెక్షన్ నిధులపై లెక్కలు కరువు

జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో సెక్షన్ల ఆధునికీకరణకు 2024 జనవరిలో రూ.90.40 లక్షలకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. సెక్షన్ కార్యాలయాలకు తలుపులు పెట్టడం తప్ప ఇతర పనులేవీ చేయని పరిస్థితి ఉంది. ఈ నిధులతో సెక్షన్ కార్యాలయాల్లో ఎసిల ఏర్పాటుతోపాటు ఇతర పనులు చేయాల్సి ఉంది. రూ.90 లక్షల నిధులు ఏవిధంగా ఖర్చు చేశారో లెక్కలు చెప్పేవారే కరువయ్యారు. ఉద్యోగ సంఘ భవనాన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడం వివాదమై అభాసుపాలయ్యారు. చివరికి అనుమతులు రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాము పంపించిన ఫైల్స్‌పై సంతకాలు చేయకపోతే అధికారులను ఇబ్బంది పెడుతున్నారనే చర్చ నడుస్తోంది. జిల్లా పరిషత్‌లో నిధుల వినియోగానికి సంబంధించి విచారణ నిర్వహిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

జాతీయ నాయకుల విగ్రహాలను మూసేసేలా దుకాణాల నిర్మాణం

అవకతవకలపై సర్వసభ్య సమావేశంలో డీసెంట్ నోట్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నవంబర్ 25న జరిగింది. ఎజెండాలో ఇచ్చిన అంశాల్లో అనేక అవకతవకలు ఉన్నాయని జిల్లా పరిషత్ సభ్యులు కొంతమంది డీసెంట్ నోట్ ఇచ్చారు. డీసెంట్ నోట్‌లో అనేక అంశాలను ప్రస్తావించారు. బహిరంగ వేలం పెట్టకుండా కలిదిండి, కాళ్లతోపాటు ఇతర మండలాల్లో ప్రస్తుత లీజుదారులను కొనసాగించడం, గతంలో మంజూరు చేసిన 209 పనులకు రూ.పది కోట్లు, రూ.164 పనులకు రూ.8 కోట్లు పనుల పేర్లు లేకుండా, అంచనా విలువ లేకుండా అనుమతికి పెట్టడం, ఫ్లవర్ బొకేలకు, కేకులకు రూ.లక్షా 20 వేలు ఖర్చు పెట్టడం వంటి అనేక అంశాలు డీసెంట్ నోట్‌లో ఉన్నాయి. సమావేశాల సమయంలో భోజన ఖర్చుల కింద రూ.లక్షలు బిల్లులు పెడుతున్నట్లు సైతం చర్చ నడుస్తోంది. పాలకులకు జిల్లా పరిషత్ అధికారులు వత్తాసు పలుకుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై పోరాటాలు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న కిరణ్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు సాగిస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక విద్యార్థి హక్కులు, ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపర్చడం, ప్రయివేటు విద్యారంగానికి ప్రోత్సహంగా ప్రభుత్వాల విధానాలు ఉన్నాయని విమర్శించారు. విద్యార్థి సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా పోలీసుల ద్వారా ప్రభుత్వం నిర్బంధకాండకు పాల్పడుతుందని అన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలపై న్యాయం కోరిన నాయకులపై ముందస్తు అరెస్టులు దారుణమన్నారు. ఎంతటి నిర్బంధం, అణచివేత చర్యలకు పాల్పడినా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, గిరిజన, బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల రక్షణ, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.మనోజ్, నాయకులు శివాజీ, జయంత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్

పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు మనస్సు పెట్టి పని చేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం పిజిఆర్ఎస్ అర్జీలు, 22ఎ కేసులు, అడంగల్లు, ఇంటి స్థలాలు, రీసర్వే, ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఎంఎస్ఎంఇ పార్కులు, లోకాయుక్త, కోర్టు కేసులు, సిసిఆర్‌సి కార్డులు మొత్తం 12 అంశాలపై మండలాలవారీగా సమీక్షించారు. ప్రగతిలో వెనుకబడ్డ మండలాల తహశీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ణీత సమయంలో లక్ష్యాలు పూర్తి చేయకపోతే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ప్రతి ఫిర్యాదునూ అధికారులు అధ్యయనం చేసి ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ఐవిఆర్ఎస్ కాల్స్ సర్వేలో ఫిర్యాదుదారుల సంతృప్తి చాలా తక్కువగా ఉందన్నారు. కొంతమంది ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. రీసర్వేలో ఇళ్ల స్థలాలు, పంట పొలాల సరిహద్దు కొలతల నిర్ధారణలో హెచ్చుతగ్గులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒలు ఎం.అచ్యుతఅంబరీష్, ఎంవి.రమణ, డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి, సర్వే ఎడి అన్సారీ, కలెక్టరేట్ ఎఒ ఎన్‌వి.నాంచారయ్య, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం

సమాచార హక్కు చట్టం 20 సంవత్సరాల వేడుకలు కలెక్టరేట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఆట్లాడుతూ అవినీతిని అరికట్టడానికి ఒక ముఖ్యమైన ఆయుధం ఈ చట్టమని అన్నారు. సమాచార హక్కుచట్టంపై ప్రతి అధికారీ అప్రమత్తంగా దృష్టి సారించాలన్నారు.

దీక్షలు విరమించిన ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఆర్‌టిసి ఎమ్‌డితో రాష్ట్ర నేతలు

ఏలూరు ఆర్‌టిసి పెట్రోల్ బంకులో అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ఏలూరు డిపోలో పని చేస్తున్న ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరుతూ ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు, ఆందోళన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు జెఎసి నేత, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిపో గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాస్ తెలిపారు. 15 రోజులుగా అక్రమ సస్పెన్షన్లపై ఏలూరు డిపోలో సాగుతున్న ఉద్యమంపై జెఎసి రాష్ట్ర నాయకత్వం శుక్రవారం విజయవాడలో ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకాతిరుమలరావుతో చర్చించిందన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటానని, అవినీతితో సంబంధం లేని వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్‌డి స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ఆందోళనలు విరమించామని, కార్యక్రమాల విజయవంతానికి సహకరించిన అన్ని కార్మిక సంఘాలకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాలకు, ఉద్యమానికి సహకరించిన, మద్దతు తెలిపిన సిఐటియు, ఎఐటియుసి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బికెఎంయు తదితర సంఘాల నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

జ్యూట్‌మిల్లు కార్మికులకు నిరుద్యోగ భృతి అందించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు, కొత్తూరు జ్యూట్‌మిల్లులు మూతపడిన కారణంగా దాదాపుగా 5800 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, వీరికి ఇఎస్ఐ ద్వారా నిరుద్యోగ భృతిని అందించాలని సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జ్యూట్‌మిల్లు మూసివేత కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులు కనీస అవసరాలకు సైతం అనేక ఇబ్బందులు పడుతున్నారని, వ్యక్తిగత వైద్య ఖర్చులకు మందులు కొనుక్కునేందుకు డబ్బులు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి కోల్పోయిన కార్మికులను ప్రభుత్వం సైతం ఆదుకోకపోవడం చాలా బాధాకరమని, నేటికీ ఏలూరు నగరంలో సరైన ఉపాధి అవకాశాలను ప్రభుత్వాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. ఏలూరు నగరంలో ఉన్న షాపింగ్ మాల్స్, హోటల్స్ తదితర వాణిజ్య సముదాయాల్లో పని చేస్తున్న కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలను సైతం అందించడం లేదని, రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేస్తున్నప్పటికీ కనీస వేతనాలను అమలు చేయడం లేదని తెలిపారు. మహిళ కార్మికులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మిక వర్గం తిరగబడుతుందని తెలిపారు. ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖ ఉక్కునగరంలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభలో పలు తీర్మానాలను ఆమోదిస్తామని, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఐక్యంగా ముందుకు రావాలని సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభ సందర్భంగా నిర్వహించే భారీ బహిరంగ సభ, ప్రదర్శనను కార్మికులంతా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్రం సాయికిరణ్ కోరారు. స్థానిక సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో కుంజా నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మూడేళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలపై, సమస్యలపై చర్చించి నూతన ప్రణాళికలు సిద్ధం చేయడం కోసం మహాసభ జరుగుతుందన్నారు. దేశం నలుమూలల నుంచి ఈ మహాసభకు ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. మహాసభ చివరి రోజు నాలుగో తేదీన భారీ ప్రదర్శన, ఆర్‌కె.బీచ్‌లో లక్ష మంది కార్మికులతో బహిరంగ సభ నిర్వహించి మహాసభలో తీసుకున్న నిర్ణయాలు కార్మికులందరికీ తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాయికిరణ్ పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు బాడీసా సుజాత, కాక బాపనమ్మ, పాముల అన్నపూర్ణ, కమల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : విశాఖలో జరిగే సిఐటియు 18వ అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో సిఐటియు చేపట్టబోయే వివిధ కార్యాచరణలను ఈ మహాసభలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, ఆటో యూనియన్ నాయకులు పి.సత్తిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకులు వి.గోపీ, వి.సత్యనారాయణ, బి.నాని, ఆనందరావు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను చేర్చాలి

ఇటుకలకోట సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలోని షెడ్యూల్డ్ గ్రామాలు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం మండలాల్లోని 28 నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను చేర్చాలని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని ఇటుకలకోట గ్రామ సచివాలయం వద్ద స్థానిక సమస్యలు పరిష్కరించాలని, పోలవరం నియోజకవర్గంలోని షెడ్యూల్డ్, నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను పోలవరం జిల్లాలో కలపాలంటూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం దారుణమన్నారు. ఇటుకలకోటలో డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అటవీ హక్కుల చట్ట ప్రకారం పోడు సాగుదార్లకు హక్కు పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు తామా బాలరాజు, కొమరం పోసిరత్నం, సముద్రాల సాయికృష్ణ, ధర్ముల లక్ష్మి, సున్నం వెంకటేశ్వరరావు, ఎం.సుధారాణి, ఇంద్రావతి, సరోజిని, భీమరాజు, వెంకటలక్ష్మి, శ్రీనివాస్, వీరాయమ్మ పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న నేతలు

ఆర్‌జియుకెటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు విద్యార్థులు ఇటీవల క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లలో సాధించిన అత్యుత్తమ విజయాలను గర్వంగా ప్రకటిస్తున్నామని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ సండ్ర అమరేంద్రకుమార్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ చిరంజీవి, ప్లేస్‌మెంట్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ చింతం నాయుడు తెలిపారు. బి.టెక్ మూడో సంవత్సరం ఇసిఇ విభాగానికి చెందిన విద్యార్థి టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థలో ఎంపికై నెలకు రూ.75 వేల స్టైఫండ్ పొందనున్నట్లు తెలిపారు. అదే విభాగానికి ముగ్గురు విద్యార్థులు ఎనలాగ్ డివైసెస్‌లో ఎంపికై నెలకు రూ.50 వేల స్టైఫండ్‌తో పాటు పర్ఫార్మెన్స్ ఆధారిత ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పొందారని తెలిపారు. బి.టెక్ నాలుగో ఏడాది కెమికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులు డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో రూ.4.7 లక్షల వార్షిక ప్యాకేజీతో నియమితులైనట్లు తెలిపారు. ఈ విజయాలు తమ విద్యార్థుల కృషి, బోధకుల నిరంతర సహకారం, సంస్థ తీసుకుంటున్న లక్ష్యబద్ధమైన శిక్షణా చర్యలకు నిదర్శనమన్నారు. నాణ్యమైన విద్య, మెరుగైన ఉద్యోగావకాశాలను అందించడంలో ఆర్‌జియుకెటి తన కట్టుబాటును కొనసాగిస్తుందన్నారు.

ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలి

అప్పుడే అంబేద్కర్ కలలు కన్న సమానత్వం సాధ్యం

వర్ధంతి కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా సమానత్వ స్వాప్నికుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కలలు కన్న సమానత్వం సాధ్యపడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి రవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. రాజ్యాంగ రూపకల్పనలో భారత దేశ పరిస్థితులకు అనుగుణంగా అంబేద్కర్ చేసిన కృషి గొప్పదని, మహిళా హక్కులు, వెనుకబడిన తరగతులకు సమాన అవకాశాల కోసం అంబేద్కర్ పాటుపడ్డారని కొనియాడారు. జ్ఞానవంతుడిగా అధ్యయనం ద్వారా సమాజాన్ని పరిశోధించి హక్కులు సాధించడంలో అంబేద్కర్ అగ్రభాగాన నిలబడ్డారన్నారు. ప్రభుత్వ రంగంలో విద్య ఉపాధి అవకాశాలు తగ్గిన నేపథ్యంలో ప్రయివేటు రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నాలు చేస్తే సామాజిక శక్తులతో కలిసి సిపిఎం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్, నాయకులు ఎం.ఇస్సాక్, జె.గోపి, వివిఎన్.ప్రసాద్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

వట్టి మాటలేనా.. గట్టి చేతలుండేనా..!

'వట్టి మాటలు కట్టిపెట్టోయ్.. గట్టి మేలు తలపెట్టవోయ్' అని మహాకవి గురజాడ పలుకులు ప్రస్తుతం రెండు జిల్లాల్లోని ప్రజల ఆకాంక్షలుగా మారాయి. పాలకులు, ఉన్నతాధికారులు మాటలకే పరిమితమవుతున్నారు తప్ప చేతలు ఉండటం లేదని అంతా పెదవి విరుస్తున్నారు. ఏలూరు జిల్లాలో సిఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా మరోసారి జిల్లాలోని సమస్యలు తెరపైకొచ్చాయి. 'బొమ్మాళీ.. నిన్ను వదలా' అనే రీతిలో రైతులను ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయి.

సిఎం చంద్రబాబు ఉంగుటూరు నియోజకవర్గ పర్యటన అట్టహాసంగా సాగింది. కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి పెన్షన్ సొమ్ము అందించిన చంద్రబాబు ఆ కుటుంబ సమస్యలు తెలుసుకుని ఆపన్న హస్తం అందిస్తూ పలు హామీలిచ్చారు. కచ్చితంగా ఆ కుటుంబం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని, చంద్రబాబు స్పందనను అంతా హర్షించాల్సిందే. అయితే ఇటువంటి కుటుంబాలు ఇంకా చాలా ఉన్నాయి. వైద్యానికి ఖర్చు పెట్టలేక ఆస్తులు అమ్ముకుని, అప్పుల పాలై, పిల్లల చదువులు ఆపించేసిన కుటుంబాలు కోకొల్లలు. దీనంతటికీ పరిష్కారం చూపాల్సిన బాధ్యత పాలకులపై కచ్చితంగా ఉంది. అదేదో ఆర్థిక సాయం అనుకుంటే పొరబడినట్లే. వైద్యం అందరికీ ఉచితంగా అందేలా ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయడం, అన్ని తరహా వ్యాధులకు చికిత్స అందించేలా సదుపాయాలు కల్పించడంతోపాటు వైద్యులు, సిబ్బంది నియామకం అత్యంత కీలకం. అదే జరిగితే జిల్లాలోని సగం కుటుంబాలు అప్పుల బారి నుంచి బయటపడి ఆనందంగా జీవిస్తాయంటే అతిశయోక్తి కాదు. కిడ్నీ వ్యాధిగ్రస్తులే కాదు.. రెండు జిల్లాల్లో కేన్సర్ మహమ్మారి పడగలు విప్పి బుసలు కొడుతోంది. వీధికో కేన్సర్ బాధితులు కన్పిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేన్సర్ నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటూనే, మరోపక్క రోగులకు చికిత్స అందించేలా ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రధానంగా రెండు జిల్లాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందో.. లేక వట్టి మాటలతో సరిపెడుతుందో వేచిచూడాలి. ఇక సిఎం తన ప్రసంగంలో కొల్లేరు సమస్యకు పరిష్కరిస్తామని ప్రకటించారు.



కొల్లేరు సాధికారత కమిటీ నివేదిక ఏమిటో తెలియని పరిస్థితి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అక్కడి ప్రజలు కోరుతుంటే ఎకో సెన్సిటివ్ జోన్ పేరిట పదో కాంటూరుకు విస్తరించేలా చర్యలు కన్పిస్తున్నాయి. సాక్షాత్తూ ఎన్నికల సభలో ప్రధాని మోడీ, రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం సైతం ఆచరణకు నోచని దుస్థితి కన్పిస్తోంది. ఈ పరిస్థితుల్లో సిఎం చంద్రబాబు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో స్పష్టం చేయడంతోపాటు అక్కడి ప్రజలకు మేలు జరిగేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉంది. ఇక చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిపై మాట్లాడుతున్న పాలకులు అక్కడ భూములిచ్చిన రైతుల గోడు పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలోనూ చంద్రబాబు సిఎంగా ఉండగానే ఈ అంశాన్ని నాన్చుతూ కాలం గడిపారనే ఆరోపణలు ఉన్నాయి. మరి ఇప్పుడు రైతులకు న్యాయం చేసి చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేస్తారో, లేక రైతులను పక్కన పెట్టి పూర్తి చేస్తారో వేచిచూడాలి.

ఇక దేశానికి వెన్నెముక రైతు అని, తమది రైతు ప్రభుత్వమని నాటి నుంచి పాలకులు వల్లె వేయడం తప్ప ఆచరణలో రైతులకు మిగిల్చేది అప్పులేనని ఎవరినడిగినా ఇట్టే చెబుతారు. అయితే ధాన్యాగారంగా పేరొందిన పశ్చిమగోదావరి జిల్లాలో వరి రైతుల పరిస్థితి ఏమిటో ఏ రోడ్డెక్కినా కళ్లకు కట్టినట్లు కన్పిస్తోంది. మొంథా, దిత్వా తుపాన్ల బారిన పడిన వరి పంటను ఎట్టకేలకు మాసూళ్లు చేసి అమ్ముకుందామనుకుంటే తేమ శాతం నిబంధన అడ్డంకిగా మారింది. దీంతో రైతులు తమ ధాన్యాన్ని రోడ్లే కళ్లాలుగా చేసుకుని ఆరబెట్టుకుంటున్నారు. రెండు తుపాన్ల దెబ్బతో వరి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. పైపెచ్చు తేమ శాతం నిబంధన, ఇతర పేర్లతో మిల్లర్లు ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం. ప్రభుత్వం మాత్రం నష్టం 33 శాతంకన్నా ఎక్కువ ఉండాలనే నిబంధన పేరుతో రైతులకు పరిహారం ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతుంది. పెట్టుబడి ఖర్చులు, శ్రమ అన్నీ కలిపి పరిహారం లెక్కగట్టకపోయినా నష్టం శాతం నిబంధన పక్కన పెట్టి అరకొర పరిహారమైనా రైతులకు అందిస్తే సాగు సజావుగా సాగే అవకాశం ఉంది. వరి కాదని ఆక్వా సాగుకు వెళ్లిన రైతులు ఇప్పటికే అక్కడ నష్టాలు పెరగడంతో ఏం చేయాలో పాలుపోక సాగుకే దూరమవుతున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తే ధాన్యాగారం, ఆక్వా హబ్ అనే మాటలు గత చరిత్రగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా వ్యవసాయం విషయంలో పాలకులు వట్టి మాటలు కట్టి పెట్టి.. గట్టి చేతలు తలపెడితేనే ఎంతోకొంత ఉపయోగం ఉంటుందని అందరి మాట.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

రహదారి మూసివేశారని ఆందోళన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

మండలంలోని సర్వవారిగూడెం పంచాయితీ పరిధిలోని పునరావాస కాలనీ కన్నాయిగుట్టకు వెళ్లేందుకు రహదారిని గ్రామానికి చెందిన రైతు కంచెను ఏర్పాటు చేసి మూసివేశాడని పలువురు నిర్వాసితులు శనివారం గ్రామ శివారులోని రహదారిపై ఆందోళన చేపట్టారు. గ్రామంలోకి వెళ్లేందుకు ఉన్న రహదారి గుండా కొంత మేర వ్యవసాయ భూమి ఉండటంతో ఆ రైతు ఇటీవల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిమిత్తం భూమిని పెట్టగా ఆ భూమి వివాదంలో ఉండటంతో భూ సేకరణ అధికారులు దానిని తిరస్కరించారు. దీంతో కోపోద్రిక్తుడైన రైతు నిర్వాసిత కాలనీకి వెళ్లే దారికి కంచె వేసి మూసేశాడు. దీంతో పలువురు నిర్వాసితులు తమ గ్రామాల్లోకి వెళ్లేందుకు రహదారి కావాలని రోడ్డెక్కారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త నెలకొంది. ఘటనా స్థలానికి పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది వెళ్లి కంచె వేసిన రైతుతో మాట్లాడి కంచెను తొలగించడంతో ఆందోళన విరమించారు. అయితే తమ గ్రామంలోకి వెళ్లేందుకు పూర్తి స్థాయి రహదారి చూపించాలని అధికారులను నిలదీయగా త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ ఉదయభాస్కర్ హామీ ఇచ్చారు.

ఘనంగా బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు



వార్షికోత్సవ వేడుకలో మాట్లాడుతున్న ప్రముఖులు

టిడిపి హయాంలో సిఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్, ఎపి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పది వసంతాలు పూర్తి చేసుకుంది. 11వ వసంతంలోకి అడుగు పెడుతుంది. ఈ సందర్భంగా ఏలూరు శాఖ ఆవరణలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్రాహ్మణ కార్పొరేషన్ నూతన పాలకవర్గ సభ్యులు చెరుకుపల్లి సంతోష్, సబ్బరిసు కృష్ణమోహన్, కిష్కిందపురం శ్రీ సీతారామలింగేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ వేలూరి శ్రీధరశర్మ, ఎపి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాజీ డైరెక్టర్, శ్రీశ్రీ విద్యానందుల అనిలేశ శ్రీ శర్మ, మాజీ పాలకవర్గ సభ్యులు సిండికేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ బొడ్డపల్లి సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ ప్రభుత్వ అధ్యాపకులు గోపరాజు వెంకటసుబ్బారావు, బ్రాహ్మణ బంధు పోడూరి కనకదుర్గ, పలువురు డిపాజిటర్లు, రుణ గ్రహీతలు, శ్రేయోభిలాషులు, బ్రాహ్మణ మిత్రులు, బంధువులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన బ్రాహ్మణ యువత కేవలం రూ.600తో సభ్యత్వం తీసుకుని స్వల్ప వడ్డీతో రుణ సౌకర్యం పొంది వారి ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏలూరు శాఖ మేనేజర్ నోరి లక్ష్మీనరసింహం, స్టాఫ్ వేలూరి వెంకటమాధురి, వెంకటసాయిమురళి పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 29 మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా వార్పు చేశారు. వారికి అపాయింట్‌మెంట్ లెటర్లను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం, కామవరపుకోట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సుమారు 11 మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీ కేంద్రాలుగా మార్చిన సందర్భంగా వారికి అపాయింట్‌మెంట్ లెటర్లను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, సిడిపిఒ పి.ఉజ్వల పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,01,116 విరాళం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ద్వారకాతిరుమలలో శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మంతెన సోమరాజు రూ.10,01,116 విరాళంగా అందించారు. శనివారం తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో ఈ విరాళాన్ని టిటిడి ఇఒ కార్యాలయ ప్రతినిధికి అందించారు. ఈ సందర్భంగా సోమరాజు దంపతులను, కుటుంబ సభ్యులను టిటిడి తరపున నిర్వాహకులు సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల మండలం సత్తల గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి కేంద్ర నిధులు ఆర్‌జిఎస్ఎ రూ.22 లక్షలు, ఉపాధి హామీ నిధులు రూ.7.32 లక్షల నిధులతో శనివారం రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి బాదిన సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు శ్యామ్యూల్, ఎంపిడిఒ పివివి.ప్రకాష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మద్యం మత్తులో వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మద్యం మత్తులో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి బీరు సీసాతో దాడికి పాల్పడి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని చిగురుకోటలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిడి రామకృష్ణ కైకలూరు టౌన్ విఆర్‌ఒగా పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన బత్తుల సత్యనారాయణ (సత్తిపండు)తో కలిసి స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బెల్ట్ షాపులో మద్యం తాగారు. అదే సమయంలో అక్కడే మద్యం తాగుతున్న మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం గ్రామ సర్పంచి శేషగిరి కుమారుడు బోనం ప్రసాద్ గొంతులో బత్తుల సత్యనారాయణ మద్యం సీసా పగలగొట్టి పొడవడంతో ప్రసాద్‌కు తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సంఘటన ఆర్‌అండ్‌బి రోడ్డుపై జరగడంతో స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుని 108 వాహనంలో గుడివాడలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. విఆర్ఒ బి.రామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బత్తుల సత్యనారాయణ పరారీలో ఉన్నట్లు సమాచారం.

కారు దగ్ధం

జంగారెడ్డిగూడెం : బాపులపాడు మండలం వీరవల్లి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం కారు దగ్ధమైంది. కారులోని వారు ముందుగానే బయటకు వచ్చేయడంతో ప్రమాదం తప్పింది. వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి చెందిన తూటికుంట మంగరాజు, గంగరాజు, దుర్గారావు, రాంబాబు, భవాని, వెంకటలక్ష్మి, మాధవి ఏడుగురు కారులో శనివారం విజయవాడ కనకదుర్గమ్మ తల్లి దర్శనానికి బయలుదేరారు. వీరవల్లి వద్దకు వెళ్లేసరికి కారులో పొగలు రావడం గమనించిన డ్రైవర్ అప్రమత్తమై కారు రోడ్డుపై ఆపాడు. కారులో అందరూ బయటకు వచ్చేశారు. అంతలోనే మంటలు చెలరేగి కారు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న వీరవల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తక్షణమే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్లు చేరుకుని మంటలను అదుపు చేశాయి. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

టి.నరసాపురం : మండలంలోని బండివారిగూడెంలో నందిన వీర భద్రం అనే రైతుకు చెందిన సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అనధికారికంగా వ్యవసాయ బోరుకు విద్యుత్ వినియోగిస్తున్నారనే సమాచారంతో విద్యుత్ విజిలెన్స్ అధికారి ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించి రైతు వీరభద్రంపై కేసు నమోదు చేశారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత

జీలుగుమిల్లి : అక్రమంగా పశువులను కబేళాలకు తరలిస్తున్న లారీని జీలుగుమిల్లి శివారులో పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి శివారులో సిబ్బందితో శనివారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా పార్వతీపురం సంత నుంచి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌కు అక్రమంగా కబేళాలకు వెళ్తున్న పశువుల లారీని పట్టుకున్నట్లు తెలిపారు. లారీని స్టేషన్‌కు తరలించి, డ్రైవర్లపై కేసు నమోదు చేసి, లారీలో ఉన్న 51 పశువులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమానత్వాన్ని కోరుకున్న మహనీయుడు అంబేద్కర్

వర్ధంతి కార్యక్రమాల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పౌరులందరికీ సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపుదిద్దిన భారతరత్న, డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు ప్రతిఒక్కరూ రుణపడి ఉండాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పిలుపునిచ్చారు. ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత దళిత నేతలతో కలిసి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎపి మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

జంగారెడ్డిగూడెం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని వేగవరం గ్రామంలో శనివారం నిర్వహించారు. గ్రామస్తులు నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా పలువురు యువకులు రక్తదానం చేశారు. జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పి.సూర్యారావు, బి.బాలరాజు, వి.గోపీ, పి.సునీల్, కె.సురేష్ పాల్గొన్నారు.

మండవల్లి : సమానత్వాన్ని కోరుకున్న ఏకైక వ్యక్తి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సెంటర్‌లోని బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఎంతో శ్రమించి అందించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

కొయ్యలగూడెం : మాలమహానాడు జిల్లా కార్యదర్శి కరుటూరి చంటిబాబు ఆధ్వర్యంలో కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు మండలాధ్యక్షుడు తొర్లపాటి వాసు అధ్యక్షత వహించారు. మండల యూత్ అధ్యక్షుడు బోడా రాజశేఖర్, శూలం వెంకటరమణ, కిరణ్‌కుమార్, వెంకట్రావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంబేద్కర్ చిత్రపటానికి పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని దర్భగూడెం, జీలుగుమిల్లి గ్రామాల్లో జాతీయ రహదారి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు మనోజ్, దావీదు, అరుణ్, శ్రీను, కన్నయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు దాసరి ఆంజనేయులు, మెండెం సంతోష్ కుమార్, నేతల రమేష్ బాబు, అబ్బూరి అనీల్ కుమార్, దాసరి నాగేంద్ర కుమార్, ప్రొఫెసర్ ఎన్ఎడి పాల్, పల్లెం ప్రసాద్, మేతర అజయ్‌బాబు పాల్గొన్నారు. జై భీం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముసునూరు : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సామ్యూల్, ఆఫీస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మాలమహానాడు జిల్లా కార్యదర్శి కరుటూరి చంటి బాబు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు తొర్లపాటి వాసు అధ్యక్షత వహించారు. మండల యూత్ అధ్యక్షుడు బోడా రాజశేఖర్, శూలం వెంకటరమణ, కిరణ్ కుమార్, వెంకట్రావు, రాజా పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి హైస్కూల్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నూజివీడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తులిమిల్లి సుజన పావన జ్యోతి, ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షులు మల్లంపల్లి రవిశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోట : రామన్నపాలెంలో కన్వీనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో, గ్రంథాలయంలో టివిఎస్.రాజు, షేక్ ఇబ్రహీం ఆధ్వర్యంలో, కొత్తూరులో వైసిపి వైస్ ప్రెసిడెంట్ మేడంకి విజయరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాల్లో రామన్నపాలెం గ్రామ సర్పంచి రాయంకుల తులసి, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి భీమిరెడ్డి వెంకన్న బాబు, తడికలపూడి సొసైటీ మాజీ ఛైర్మన్ రవి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు బాబూరావు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు మాట్లాడారు. ఏటిగట్టు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పోలవరం సర్పంచి పొడుం పుష్ప, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, కప్పల రాజు, ఫాతి మామున్నిసా, గంజి మధు, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేలేరుపాడు : ఫ్రెండ్స్ ఆటో యూనియన్ (సిఐటియు) నాయకులు పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీరం ఆంజనేయులు, బల్లా మల్లేశ్వరరావు, బుర్రి సుధాకర్, కిట్టు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు

ముదినేపల్లి : ముదినేపల్లి అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ, అంబేద్కర్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అదేవిధంగా ఆదర్శ పరిరక్షణ సంఘం పెద్దలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవా నాగ జగన్ బాబురావు, లేళ్ళ ప్రసాద్, మద్దాల థామస్, గద్దె రాజు, కొప్పుల నాగరాజు, కొరగంటి రాంపండు, గండేపూడి మహేంద్ర, కారే గౌతమ్, సోమల వెంకటేశ్వరావు, గోళ్ళ రాజ్ కుమార్, పరిసిపోగు ప్రసాద్, గుమ్మడి భూషణ్ కుమార్, షేక్ ఆకాష్, కంచర్ల కిరణ్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం అంబేద్కర్ కాలనీలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.డేవిడ్‌రాజు, బి.విజయరాజు, దాసు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

కాలేజీలో ఐద్వా ఆధ్వర్యాన సెమినార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'హింసను వ్యతిరేకిద్దాం-సమానత్వాన్ని సాధిద్దాం - మానవహక్కులే మహిళా హక్కులు' అంశంపై సెమినార్ స్థానిక సిఆర్.ఫార్మసీ కాలేజీలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సంఘ జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సెమినార్‌కు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల అణిచివేతకు వ్యతిరేకంగా సమానహక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా మహిళలపై హింసను అరికట్టి స్త్రీ,పురుషుల మధ్య సమానత్వ సాధన కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకులు ఎం.అరుణకుమారి, వి.సత్య, ఫార్మసీ విద్యార్థినులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ చేశారు. గోపవరం పాఠశాలలో మండల సహ అధ్యక్షురాలు జి.సత్యప్రియ అందించారు. కాట్రేనిపాడు పాఠశాలలో మండల గౌరవ అధ్యక్షులు సిహెచ్.జాకోబ్‌రాజు ఆయన విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆయన సొంత నిధులతో విద్యార్థులకు మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా సత్యప్రియ మాట్లాడుతూ ఉదార స్వభావంతో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కాసాని గాంగేయుడు, మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు, సహాధ్యక్షులు పుల్లయ్య, మండల కార్యదర్శులు విష్ణువర్ధనరావు, శ్రీనివాసనాయక్, వివిఎల్.కాత్యాయని, జి.పద్మావతి పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నిరుపేదలకు ఆర్థిక భరోసాగా సిఎం సహాయ నిధి ఉపయోగపడుతుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో అనారోగ్యానికి గురై ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న 11 మందికి మంజూరైన రూ.11,76,125 సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ బాలరాజు చేతులమీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యపరంగా సిఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

విత్తన చట్ట ముసాయిదాపై నిరసన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని మనుగోపుల గ్రామంలో శనివారం రామాలయం వద్ద రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విత్తన చట్ట ముసాయిదాపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ వర్గాల చెరలోకి నెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం విత్తన చట్ట ముసాయిదాను రూపొందించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధరల చట్టం కోసం రైతాంగం ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా పోరాడుతుంటే, రైతుల ప్రయోజనాలపై పెదవి విరిచే కేంద్రం సామ్రాజ్యవాద కంపెనీలకు అనుకూలంగా చట్టాలను తెస్తుందన్నారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు బహిరంగంగా కాలరాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కోటం బుచ్చమ్మ, ఉప సర్పంచి కారం దుర్గ, సున్నం అరవలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు చెప్పారు. మండల పరిధిలోని కొర్లకుంట శివారు సింహాద్రి అప్పారావుపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు సంఖ్య మరింత పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సినీ నటుడు, పాస్టర్ జోసెఫ్ మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నిడమర్రు మండలం పెదనింద్రకొలను గ్రామానికి చెందిన పాస్టర్, సినీ నటుడు మర్రిపూడి శ్రీనివాసరావు (జోసెఫ్) (44) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందారు. చిలకలూరిపేటకు ఉపన్యాసాలకు వెళ్లి తిరిగి వస్తుండగా గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఆయన మర్రిపూడి సుబ్బారావు, సుబ్బలక్ష్మిల ఏకైక కుమారుడు. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత 25 ఏళ్ల క్రితం ఉంగుటూరు మండలం చేబ్రోలులో పాస్టర్ యోబు దగ్గరకు వెళ్లి అక్కడే ఉండి ఆయన వద్ద శిష్యుడిగా కొనసాగారు. పాతాళ భైరవితోపాటు మరో ఆరు సినిమాల్లో జోసెఫ్ నటించారు. కృష్ణంరాజు, బాలకృష్ణ, కమల్‌హాసన్‌తో కలిసి నటించారు. బాల్యంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో మరగుజ్జు అయిన ఇతన్ని కుటుంబసభ్యులు ఎవరూ ఆదరించలేదు. దీంతో ఆయన చిన్నతనంలో మూడేళ్లు భిక్షాటన చేసుకుని బతికానని ఇటీవల ఓ సభలో ఆయనే చెప్పారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. క్రైస్తవ సభల్లో హాస్య మత బాటకుడిగా ఎంతో పేరు ప్రఖ్యాతలు గడించారు.

అభినందనీయులు తెలుగు మాస్టర్ పెద్దిరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మహా సంకల్పంతో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహణ సారథ్యంలో తెలుగు భాషా సంస్కృతి ఔన్నత్యం కోసం జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు-2025 విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నవంబర్ 22, 23వ తేదీల్లో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజు పిహెచ్‌డి పుస్తకం స్మైల్ రచనలు-అనుశీలన తెలుగు పరిశోధనాత్మక వ్యాసాలు సాహితీ సిరులు రెండు పుస్తకాలను రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డి విల్సన్ ఆవిష్కరించారు.

పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - భీమడోలు

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని, మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్, కోరారు. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన వందరోజుల ప్రణాళిక అవగాహనా సదస్సును మండలంలో శనివారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తయిన నేపథ్యంలో శనివారం నుంచి విద్యార్థులకు వంద రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు.

మండల స్థాయి అధికారులకు విద్యార్థుల దత్తత

పర్యవేక్షణ అధికారులుగా కురెళ్లగూడేనికి తహశీల్దార్ రమాదేవి, ఎంఎం.పురం హైస్కూల్‌కు ఎంపిడిఒ పద్మావతి దేవి, గుండుగొలనుకు డిప్యూటీ ఎంపిడిఒ సుబ్బారావు, పొలసానిపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు డిప్యూటీ ఎంపిడిఒ-2 కె.ఫణీంద్రనాథ్, భీమడోలు హై స్కూల్‌కు గ్రామీణ నీటి సరఫరా పథకం ఎఇ సుబ్రహ్మణ్యం, పూళ్ల హై స్కూల్‌కు వ్యవసాయాధికారి ఎస్‌పివి.ఉషారాణి, ఆగడాలనంక హై స్కూల్‌కు మత్స్య అభివృద్ధి అధికారి దుర్గ భవాని నియమితులైనట్లు వారు తెలిపారు.

వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ప్రజాశక్తి - వేలేరుపాడు



వికలాంగులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న దాతలు

హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ విజయవాడ వారి ఆధ్వర్యంలో మేడిపల్లి పంచాయతీలో ఉన్న ఎనిమిది మంది వికలాంగులకు శనివారం సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ వెంకట్ మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నవారిని తమ ట్రస్టు ద్వారా ఆదుకుంటామన్నారు. మేడేపల్లిలో ముగ్గురికి, కమ్మరిగూడెం ఐదుగురికి మొత్తం ఎనిమిది సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. హెల్పింగ్ హాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వెంకట్, హిమబిందులను కూటమి నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడేపల్లి సర్పంచి కట్టం రాంబాబు, వేలేరుపాడు కూటమి నాయకులు, జనసేన పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి కొవ్వాల క్రాంతికుమార్, శావిలి ఆనందరావు, శంకరం, ఎండి నయామ్, కుంజా లక్ష్మయ్య, మహేష్, కుంజ శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నాటకంలో విశ్వామిత్రుడి పాత్రలో సత్యనారాయణ

ఉర్రూతలూగించిన హరిచంద్ర నాటకం

విశ్వామిత్రుడి పాత్రలో ఆకట్టుకున్న కె.సత్యనారాయణ

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం షష్టి ఉత్సవాల్లో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన సత్య హరిచంద్ర పౌరాణిక నాటకం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. పౌరాణిక నాటకాలపై ప్రేక్షకులకు రోజురోజుకు ఆదరణ తగ్గిపోతుండగా ఈ నాటకానికి వెల్లువెత్తి విచ్చేసి కళాకారులకు బ్రహ్మరథం పట్టారు. ఈ నాటకం ప్రారంభం నుంచి ఆఖరి వరకు ప్రేక్షకులను కదలనివ్వకుండా కట్టిపడేసింది. వేట సీనులో విశ్వామిత్రుడిగా నటించిన స్థానిక స్వామ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ తన హావభావాలతో, డైలాగులతో ఉర్రూతలూగించారు. సత్యనారాయణ నటనకు ముగ్ధులైన ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సత్యనారాయణను పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రేక్షకులు సత్యనారాయణ నటనకు మెచ్చి నగదు బహుమతులతో ప్రోత్సహించారు. అదేవిధంగా వారణాసి కాటి సీనుల్లో హరిచంద్రుడిగా జూనియర్ డివి.సుబ్బారావు తన నటనతో ప్రేక్షకులను మైమరిపించారు. ఇతర నటీనటులు సైతం పోటాపోటీగా నటించి నాటకానికి వన్నె తెచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

ద్వారకాతిరుమల : ఆడమిల్లి నుంచి దూబచర్లకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ టి.సుధీర్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. బియ్యన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. ద్వారకాతిరుమల సివిల్ సప్లై డిటి టి.నాగరాజు ఆటోను తనిఖీ చేసి రూ.1.20 లక్షల విలువైన మూడు వేల కేజీల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రేషన్ బియ్యాన్ని, ఆటోను స్వాధీనపరుచుకున్నట్లు అధికారులు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

మారెంపూడి చక్రధర్, తండ్రి :బాల విక్టర్, డోర్ నెంబర్ 3-72, కెనాల్ దగ్గర,కాజ(ఈస్ట్) యలమంచిలి మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది 24-08-2018లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి నెంబర్ S3818783 పాస్ పోర్ట్ పొందియున్నాను. ది 10-11-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లు లోని జెరాక్స్ సెంటర్ లో నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు బైక్ పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడి పోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు.ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.

నా సెల్ నెంబర్ 9704851618

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) : TADEPALLIGUDEM

H.M.O.P.No.191/2025

Petitioner : Uppu Vijaya lakshmi

Respondents : Ankam Naga Venkata Satyanarayana

To.

Ankam Naga Venkata Satyanarayana, S/o.Veeraraghavulu, Door.No.4-52-2/4, Near Vivekananda Statue, Besides Municipal Primary School, Subbaraopeta, Tadepalligudem, TPG SCJC.

పై నంబరు O.P.No.191/2025లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు నుండి నోటీసులు పంపిగా సదరు పిటిషను సంగతులు తెలిసియుండి నోటీసులు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి ది.16-12-2025కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని.లకు పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు పైనంబరు పిటిషను తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

Kusuluri Siva Rama Krishna
Advocate & Additional Public Prosecutor,
Tadepalligudem, W.G.Dt.

IN THE COURT OF THE XIth ADDITIONAL DISTRICT JUDGE : TADEPALLIGUDEM

A.S.No.8/2025

Appellants : Uppalapati Phaneendra Chowdary and others

Respondents : Buddala Arjunarao and Others

To.

4th Respondent:

Pedasanaganti Seetaramachandra Murthy, S/o.Somayya, Near Anjaneyaswamy Temple, Relangi Village, Tanuku Mandalam .

పై నంబరు అప్పీలులో 4వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను సదరు నోటీసులు సంగతులు మీకు తెలిసియుండి సదరు నోటీసులు తీసుకొనకుండా evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చి ది.17-12-2025కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని.లకు పైకోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల మీ పరోక్షమందు పైనంబరు అప్పీలు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

Kusuluri Siva Rama Krishna
Advocate & Additional Public Prosecutor,
Tadepalligudem, W.G.Dt.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) CUM జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో

O.S.No.196/2025

బిట్వీన్ :

శ్రీమతి పెచ్చెట్టి విజయలక్ష్మి వగైరా ...వాదులు

అండ్

గుబ్బల కనకమ్మ వగైరా ...ప్రతివాదులు

సమన్స్ టు :

డి-6 : గుత్తుల పార్వతి, W/o.నాగరాజు, D/o.లేటు బొక్కా నాగమణి, వయస్సు 40 సం॥లు, హిందు, స్త్రీ, R/o.కొండేపూడి గ్రామం, పాలకోడేరు మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను, మీకు దావా సమన్లు పంపించినను, ఉద్దేశ్యపూర్వకంగా మీరు Avoid చేయుచున్నందున శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి మీరు ది.15-12-2025వ సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు స్వయముగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వేంద్ర గోపాలకృష్ణారావు
భీమవరం అడ్వకేట్, భీమవరం.
తేది.6-12-2025 సెల్: 9440174565

పబ్లిక్ నోటీసు

నా క్లయింటున్నూ కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, అన్నవరం గ్రామం, డోరునెం.1-17 కాపురస్తులు గణపవరపు (లేటు) జోగయ్య గారి కుమారుడు గణపవరపు నాగేశ్వరరావు, వయస్సు 67 సం॥లు, ఆధార్ నెం.21655345 3936, నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియ జేయునది ఏమనగా :-

నా క్లయింటు నూజివీడు సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, నూజివీడు రెవిన్యూ మండలం, అన్నవరం గ్రామ పంచాయితీ పరిధిలో చేరిన, అన్నవరం గ్రామ ఆర్.యస్.నెం. 344-2 దాఖలా య.1-12 సెంట్లలో దక్షిణ దిశగా గల య.0-56 సెంట్ల భూమి వాటా విభజన చేసుకొని, ది.31-01-2024వ తేదీన నా క్లయింటు, తన సోదరుడైన గణపవరపు వెంకటేశ్వరరావులు పార్టీషన్ దస్తావేజులు వ్రాసుకొని, నూజివీడు సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా డాక్యుమెంటు నెం.1041/2024రుగా రిజిష్టరు కాబడి, తదాది నా క్లయింటు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో అనుభవించుచున్నారు. ఇట్లుండగా ది.13-11-2025వ తేదీన ఉదయం సుమారు గం.9.00ల సమయంలో సదరు పై తెలిపిన డాక్యుమెంటు నెం.1041/2024రు గల ఓరిజినల్ పార్టీషన్ దస్తావేజు, ఇతర పత్రములను సంచిలో పెట్టుకొని నా క్లయింటు నూజివీడు, చిన్నగాంధీ బొమ్మ సెంటరులో గల జిరాక్సు షాపు వద్దకు వెళ్ళగా, దారి మధ్యలో సదరు సంచి ఎక్కడో జారి క్రింద పడిపోయింది. దానిపై నా క్లయింటు వచ్చిన దారిలో మరియు ఆ చుట్టు ప్రక్కల వెతికి చూసినప్పటికీ సదరు దస్తావేజు కనపడియుండలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయగలరు.

నూజివీడు **మన్నం రమేష్,** న్యాయవాది
తేది.06-12-2025 సెల్: 9440257636